అందరికీ అండగా ఉంటాం

రెండో వార్డులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత పాదయాత్ర ● మంగళ హారతులతో జనం నీరాజనం

- **కంటోన్మెంట్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయం**
- **బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి**

కంటోన్మెంట్, ఏప్రిల్ 18: కంటోన్మెంట్‌లో గులాబీ ప్రచారం దూకుడు పెంచింది. సబ్బండ వర్ణాల ప్రజలు బీఆర్ఎస్‌ను సొంత పార్టీలా ఆదరిస్తున్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా గత 30 ఏండ్లుగా దివంగత సాయన్న చేసిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తనను ఆశీర్వదించాలని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఓటర్లను అభ్యర్థించారు. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బోయిన్‌పల్లి వ్యవసాయ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నానగర్, అర్జున్ నగర్, ఇందిరమ్మ నగర్‌లలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో నివేదిత నాయకులు, కార్యకర్తలతో కలిసి పాల్గొని ఇంటింటికీ తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... మినీ ఇండియాగా ప్రఖ్యాతిగాంచిన కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్నిమతాలు, భాషలు, కులాల వారు ఉన్నారని.. అందరికీ అండగా ఉంటామన్నారు. సంక్షేమ ఫలాలు గడప గడపకు చేరేలా కృషి చేస్తామన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్నలాగే ప్రజలందరికీ నివేదిత అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో నివేదితతో పాటు ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో గులాబీ హవా వీస్తోందని దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన సేవలే తనను గెలిపిస్తాయన్నారు.

సాయన్న అంటే సాయం చేసే కుటుంబం: అన్నానగర్‌లో నిర్వహించిన పాదయాత్రలో కరపత్రం అందజేసి ఓటును అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

అక్కున చేర్చుకుంటున్న జనం

పాదయాత్రలో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ఏ ఇంటికెళ్లినా జనమంతా ఆమెను అక్కున చేర్చుకుని, మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలు మరువలేమన్న జనం...సాయన్న కుటుంబానికి సంపూర్ణ మద్దతు తెలుపుతామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పెన్షన్లు, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన పార్టీకి తప్పనిసరిగా సపోర్ట్ చేస్తామన్నారు. ఈ పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల హరి, సీనియర్ నాయకులు కుమార్ ముదిరాజ్, దేవులపల్లి శ్రీనివాస్‌తో పాటు కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రకు ఘనస్వాగతం పలుకుతున్న స్థానిక వార్డు ప్రజలు

ఇందిరమ్మనగర్‌లో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

చిత్రలేఖనంలో.. జునాలి ప్రతిభ

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 18: కేరళ లోని త్రిశూర్‌పురం పట్టణంలో ఈ నెల 14 నుంచి 17 వరకు మూడు రోజులు పాటు జరిగిన 'త్రిశూర్ పురం స్కెచ్ గాల 2024' (చిత్రలేఖనం) కార్యక్రమంలో సికింద్రాబాద్ మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన విద్యార్థి జునాలి పాల్గొని తన ప్రతిభను కనబర్చింది. మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో 30 ప్రాంతాల్లో ఉన్న పలు కట్టడాలు, ఆలయాలు, చర్చిలను కళ్లకు కట్టినట్లుగా తన చిత్రలేఖనం ద్వారా స్కెచ్ వేసి అందరి అభినందనలు పొందింది. గురువారం నగరానికి చేరుకున్న జునాలిని తన నివాసంలో తల్లిదండ్రులు డాక్టర్ సునీల్ కుమార్, సంధ్య దంపతులు స్వీట్ తినిపించి అభినందించారు.

నేడు కిషన్‌రెడ్డి నామినేషన్

సికింద్రాబాద్,ఏప్రిల్ 18: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి నేడు నామినేషన్ వేస్తారని ఆపార్టీ సీనియర్ నాయకుడు రవిప్రసాద్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శుక్రవారం ఉదయం 8 గంటలకు సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అభిమానులు, పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ వేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

బొల్లారం,ఏప్రిల్ 18:తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మిలటరీ దవాఖాన వద్ద బుధవారం అర్ధరాత్రి ఆయిల్‌తో వెళ్తున్న వాహనం బోల్తాపడింది.సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు,ద్విచక్ర వాహన దారులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.ట్రాఫిక్ అంతరాయం లేకుండా సమస్యను పరిష్కరించినట్లు సీఐ మధుబాబు తెలిపారు.

శోభాయాత్రలో..పద్మారావుగౌడ్

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన శ్రీరాముడి శోభాయాత్రలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామేశ్వర్‌గౌడ్, సునీల్ ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లికార్జున్, నిర్వాహకులు విశాల్, అనిల్ యాదవ్, వికాస్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.– ఉస్మానియా యూనివర్సిటీ

'గాంధీ వైద్య కళాశాల' విద్యార్థుల ప్రతిభ

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 18 : ఇంటర్ మెడికల్ కాలేజీ క్రీడా పోటీలలో గాంధీ వైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 13 నుంచి 16 వరకు కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కాలేజీలో 2వ ఇంటర్ మెడికల్ కాలేజీ క్రీడా పోటీలను నిర్వహించారు. మెడికల్, డెంటల్, హోమియో, ఫిజియో, యునాని, ఆయుశ్‌కు చెందిన 60 వైద్య కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అందులో సికింద్రాబాద్ లోని గాంధీ వైద్య కళాశాలకు చెందిన విద్యార్థులు వాలీబాల్, టేబుల్ టెన్నిస్ పోటీలలో ద్వితీయ స్థానం, ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో మూడో స్థానంలో నిలిచారు. టేబుల్ టెన్నిస్ విజేతలైన ఆదర్శ్, ఆషిశ్, శశాంక్, వాలీబాల్ విజేతలు రాజశేఖర్, అరుణ్, విష్ణు, జీవన్, సాయితేజ, యువరాజ్, సిద్ధార్థ్, సాయి, రిషిలను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.రమేశ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.కృష్ణమోహన్, గాంధీ మెడికల్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.వేణులు అభినందించారు.

విజేతలను అభినందిస్తున్న గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమోహన్‌లు

'మేడే'కు అనుమతి ఇవ్వాలి

హిమాయత్‌నగర్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే1న జరిగే మేడే ఉత్సవాలకు అనుమతి ఇవ్వాలని ఏఐటీయూసీ ప్రతినిధి బృందం గురువారం బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాంటి అడ్డంకులు లేకుండా కార్మికవర్గం మేడే జెండాలను ఎగురవేసి ఉత్సవాలు జరుపుకునే వాతావరణం కల్పించాలని కోరారు.

కష్టపడి పనిచేయండి

సమావేశంలో మాట్లాడుతున్న దానం నాగేందర్

బేగంపేట్, ఏప్రిల్ 18: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. గురువారం బేగంపేట్‌లోని పైగా ప్యాలెస్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

సికింద్రాబాద్ పార్లమెంట్ గెలిపించి రాహుల్ గాంధీకి కానుకగా ఇస్తామని సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కోట నీలిమా అన్నారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ గణేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మదర్ థెరిస్సా విగ్రహం నుంచి ప్రారంభమైన ఎన్నికల ప్రచారం పరికి బస్తీ, ముత్యాల టెంపుల్, సంతోషి మాత ఆలయం తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ...రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, తనను గెలిపించాలని శ్రీ గణేష్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు అల్లాడి గౌరీ శంకర్, నందికంటి రవి, బద్రినాథ్ యాదవ్, శ్రీనాథ్, ఏసు రత్నం, బాబు రావు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే: ఖైరతాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్, అమీర్‌పేట్ సెక్టర్ పరిధిలోని సుభాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. 5 సంవత్సరాలు దాటిన 8 మంది చిన్నారులను 1వ తరగతికి ప్రమోట్ చేస్తూ వారికి టీసీలు అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.అరుణ, టీచర్ సి.హెచ్.సుమతి, సిబ్బంది లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. – అమీర్‌పేట్

ఏబీవీపీ దిష్టిబొమ్మ దహనం

ఏబీవీపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 18: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ మతోన్మాద గుండాలు భౌతిక దాడికి పాల్పడ్డాయని ఆరోపిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ దాడికి పాల్పడిన ఏబీవీపీ నేతలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీయూలో గత రెండు రోజులుగా భయంకరమైన వాతావరణం, సంస్కృతిని సృష్టిస్తున్న ఏబీవీపీని నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవినాయక్, శ్రీకాంత్, మన్సూర్, కృష్ణ, పవన్‌కళ్యాణ్, రాజ్‌కుమార్, తనుష్, రామకృష్ణ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

రామాయణ హిందీ అనువాద పుస్తకావిష్కరణ

ఖైరతాబాద్, ఏప్రిల్ 18 : వాల్మీకి సంస్కృతంలో రచించిన రామాయణాన్ని సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో ప్రముఖ రచయిత్రి అమి గణత్రా రచించిన హిందీ అనువాద రామాయణ పుస్తకాన్ని ఆధ్యాత్మిక, సామాజికవేత్తలు ప్రగ్యా బంకా, అనంత్ ఖైతాన్‌లు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..రామాయణం అనువాదాలు అనేక భాషల్లో ఉన్నా కొందరు వ్యక్తపరిచిన అనుమానాలు, అపవాదాలను పటాపంచలు చేస్తూ వాల్మీకి రామాయణంలో ఉన్న నిజమైన అర్థం, సారాన్ని రచయిత్రి అమి గణత్రా అక్షరరూపమిచ్చారని తెలిపారు.

వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

కాచిగూడ, ఏప్రిల్ 18: ప్రాచీన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి రైల్వే సంస్థ కృషి చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనుంజయులు అన్నారు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లోని మ్యూజియంలో ప్రపంచ వారసత్వదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.

మండుతున్న ఎండలు..బస్సులు లేక విలవిల: ఓ పక్క ఎండలు దంచికొడుతున్నాయి. దీంతో ప్రాణాలు అతలాకుతలమవుతున్నాయి. అయితే దీనికి తోడు గంటల కొద్ది ఎదురుచూసినా బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం సికింద్రాబాద్ బస్‌స్టాప్‌లో బస్సుల కోసం పదుల సంఖ్యలో ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కడ చూసినా ఇలాంటి చిత్రాలే కనిపిస్తుంటాయి.

అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జూబ్లీహిల్స్ బస్‌స్టాండ్‌లో నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్

అగ్నిప్రమాదాలపై ..అవగాహన

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 18: సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్‌లో గురువారం అగ్నిమాపక అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటల్లో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలి తదితర వాటిపై అగ్నిమాపక అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్రజలను చైతన్య పరచడంతో పాటు అవగాహన పెంపొందించేందుకు అగ్ని మాపక మాక్ డ్రిల్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా అగ్ని మాపక అధికారి మధుసూదన్ తెలిపారు. ఇటీవల నగరంలో భారీ అగ్ని ప్రమాదాల కారణంగా సరైన అవగాహన లేకపోవడంతో అనేక మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారని, అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో పలు సలహాలు, సూచనలు పాటిస్తే ఆ ప్రమాదం నుంచి బయట పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇండ్లల్లో గ్యాస్ సిలిండ్ లీక్ అయినప్పుడు, వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే తీవ్రతను తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో...ప్రయాణికులకు అర్థం అయ్యేవిధంగా వివరించారు.

వడదెబ్బపై గాంధీలో అవగాహన ర్యాలీ

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 18: ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రతలు తీసుకోవాలని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. వడదెబ్బ లక్షణాలు, ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రతలపై గురువారం దవాఖానలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, వయోవృద్ధులు, బీపీ, షుగర్ ఉన్నవారు ఎండలు ఉన్న సమయంలో బయటకు రావొద్దని తెలిపారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే టోపీ, గొడుగు ధరించాలని, తాగునీరు వెంట తీసుకుని వెళ్లాలని, తరచుగా నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలను తాగాలని సూచించారు. ఎండదెబ్బ తగలగానే దవాఖానకు తీసుకుని వెళ్లాలని, అత్యవసర పరిస్థితిలో వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

కుటుంబ సంక్షేమ అధికారి డి.వెంకటరామ నర్సయ్య మాట్లాడుతూ మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల సమయంలో ఎండలు తీవ్రంగా ఉంటున్నాయని, బయటకు వెళ్లే సమయంలో నలుపు రంగు దుస్తులు ధరించకూడదని సూచించారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రలను వివరించే బోర్డులను గాంధీ దవాఖానలోని ముఖ్యమైన ప్రదేశాలలో ఏర్పాటు చేశామని తెలిపారు. చర్మవ్యాధుల విభాగం హెచ్ఓడీ డాక్టర్ నర్సింహారావు నేత, ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, సెక్యూరిటీ అధికారి శివాజీ, పలువురు వైద్యులు, నర్సులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన ర్యాలీ ప్రారంభించిన గాంధీసూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఉచిత హీట్ స్ట్రోక్ క్లినిక్ ప్రారంభం

అమీర్‌పేట్, ఏప్రిల్ 18: వేసవి ఎండలు తీవ్రరూపం దాలుస్తుండడంతో బేగంపేట్ ఫ్లైవర్ కింద ఉన్న మెడికవర్ ఆసుపత్రిలో ఉచిత హీట్ స్ట్రోక్ క్లినిక్‌ను ప్రారంభించారు. మే 31 వరకు న్యూరో కన్సల్టేషన్ ఉచితమని న్యూరాలజిస్ట్ డాక్టర్ నవ్యగోపాల్ తెలిపారు. హీట్ స్ట్రోక్ బారిన పడిన వారికి తల తిరగడం, వికారం, తరుచుగా చెమటలు పట్టడం వంటివి ఉంటాయని తెలిపారు. నడవడంలో ఇబ్బందులు, మూర్ఛలు, స్పృహ కోల్పోవడం వంటి పరిణామాలు ఉంటాయన్నారు. వడదెబ తగిలిన వెంటనే అత్యవసర వైద్య చికిత్సలు అందించకపోతే కొన్ని సందర్భాల్లో ప్రాణాపాయం కూడా పొంచి ఉంటుందని, ఈ మేరకు మెడికవర్ ఆసుపత్రిలో ఉచితంగా న్యూరో కన్సల్టేషన్ ఉంటుందన్నారు.

సైకిల్ యాత్రకు సాయం

జూబ్లీహిల్స్: అయోధ్య చేరేందుకు 20 రోజులపాటు సైకిల్ యాత్రకు సంకల్పించిన యువతకు ఆర్థిక సాయం చేయడానికి నవయువ నిర్మాణ్ సంస్థ అధ్యక్షుడు వి.నవీన్ యాదవ్ ముందుకువచ్చారు . నగరంలోని మోతీనగర్‌కు చెందిన విద్యార్థులు సాయి యాదవ్, తిరుమల్, అభిషేక్, వెంకటేశ్‌లకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తానని చెప్పారు. ఈ మేరకు గురువారం యూసుఫ్‌గూడలోని తన కార్యాలయంలో విద్యార్థులు ఆయనకు ఆయోధ్య రామమందిరం జ్ఞాపికను అందజేశారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE 1st JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT SECUNDERABAD
O.S. No.236 OF 2022
Between:
CANARA BANK.
M.G.Road Branch, M.G.Road, Opp: C.T.Centre, Secunderabad -500 025 ...PLAINTIFF
AND
SUREKHA RAGHUNATH AND ANOTHER ...DEFENDANTS
To
1) Smt. Surekha Raghunath, W/o. Dakshina Raghunath, aged about 54 years,Occ: Business, R/o. Plot No.60, 1st Floor, Sai Bliss, 60 Satya Sai Enclave, Bowenpally, Secunderabad -500 009
2) Sri. SYRYAKIRAN SESHADRI, S/o. S.Seshadri, aged about 45 years, Occ: Pvt. Employee, R/o. H.No.1-19-130/2, Kotha Basti, Venkatapuram, Near Darga, Secunderabad -500 015 ....DEFENDANTS
Take notice that the above mentioned Plaintiff herein filed the above suit for recovery of money of Rs. 2,87,624=96ps against both of you and the said case stands posted on 03-05-2024 for your appearance.
Hence you are hereby directed to appear in person or through an Advocate before the above mentioned Hon'ble 1st Jr. Civil Judge, City Civil Courts at Secunderabad on 03-05-2024 at 10-30 a.m without fail, otherwise the matter will be decided against you as per law.
(BY ORDER THE HON'BLE 1st JUNIOR CIVIL JUDGE, AT SECUNDERABD)
N.RAMA RAO, Advocate,
"Umamaheswara Nilayam" Flat No. 104, Gayatri Towers, H.No.2-2-1109/1/3, Sharada Noagar, Bagh Amberpet, Hyderabad-500 013
COUNSEL FOR PLAINTIFF